క్లుప్తంగా

వచ్చే నెల 15 లోపు ఈ-క్రాప్ నమోదు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట: వచ్చేనెల 15వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి వీఆర్వోలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీఆర్వోల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

105 మందికి నేత్ర వైద్య పరీక్షలు



తురువోలులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

చీడికాడ: మండలంలోని తురువోలులో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మంది కంటి రోగులను పరీక్షించారు. వీరిలో 36 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసి ఆస్పత్రికి తరలించారు. వీరితో పాటు మిగతా కంటి చికిత్సల కోసం పలువురిని రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ గీతాంజలి, ఆప్తాల్మిక్ అధికారి సురేష్, క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: మాకవరపాలెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సీతామహాలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన చంద్రరావు శ్రీకాకుళం జిల్లా భామిని మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇక్కడ ఈవోపీఆర్‌డీగా పని చేస్తున్న సీతామహాలక్ష్మికి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమించడంతో బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

ఎస్ఎంసీలు బాధ్యతతో పనిచేయాలి

మాడుగుల రూరల్: నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లు బాధ్యతతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పాఠశాలల యాజమాన్య కమిటీల చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, సభ్యులతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్మన్లు, ఇతర కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పాఠశాలలకు వెళ్లి, మధ్యాహ్న భోజన పథమం అమలును పరిశీలించాలన్నారు. అనంతరం నూతన చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, మైచర్ల సన్యాసిరావు, లోవతల్లి తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు మరిడి మహాలక్ష్మి తల్లి పండగ

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి మరిడి మహాలక్ష్మి తల్లి పండగను గురువారం నాతవరంలో ఘనంగా నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మండలంలో వల్సంపేట వై.బి.పట్నం యం.బి.పట్నం గ్రామాల్లో కూడా శ్రీమరిడిమ్మ తల్లి పండగను గ్రామస్తులు జరుపుకోనున్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు, గ్రామస్తులు సమష్టిగా కృషి చేయాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ అన్నారు. ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక హెచ్‌ఎం వై.స్వర్ణలత అధ్యక్షతన బుధవారం జరిగిన ఎస్ఎంసీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. స్థానిక ఎస్ఎంసీ చైర్మన్ లక్కరాజు అప్పలనర్సమ్మ, వైస్ చైర్మన్ పెద్దాడ సూరిబాబు, ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెంచుతున్నారు...
నరికేస్తున్నారు



ఎర్రవరం రాజులుబాబు గుడి వద్ద నరికేసిన చెట్లు

- పర్యావరణ పరిరక్షణకు విఘాతం
- లక్షల్లో ప్రజాధనం వృథా
- సోషల్ ఫారెస్ట్, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం

గొలుగొండ: పర్యావరణ పరిరక్షణ కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పెంచుతున్న మొక్కలను... విద్యుత్ వైర్లకు అడ్డు తగులుతున్నాయన్న కారణంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు యథేచ్ఛగా నరికివేస్తున్నా ఇటు పంచాయతీ అధికారులు, అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. సోషల్ ఫారెస్ట్ పెంపకంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పెంచుతుంటుంటే రెండు సంవత్సరాలు కాగానే.. వాటి కొమ్మలు విద్యుత్తు వైర్లకు తాకుతున్నాయని, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్న కారణంతో విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని పూర్తిగా నరికేస్తున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవడమే కాకుండా పర్యావరణం పరిరక్షణ లక్ష్యానికి విఘాతం కలుగుతోంది. సోషల్‌ఫారెస్టు, విద్యుత్ శాఖ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

జిల్లా సోషల్ ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. కానుగ, బాగుడు, గంగరాజు తదితర మొక్కలను పెద్ద ఎత్తున నాటుతున్నారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు చేపడుతున్నారు. మొక్క చుట్టూ కంచె ఏర్పాటు చేసి, వాటర్ ట్యాంక్‌లతో నీటిని పోస్తూ సంరక్షిస్తున్నారు. కానీ రెండేళ్లు గడవక ముందే అవి గొడ్డలివేటకు బలి అవుతున్నాయి.

వంద మొక్కల నరికి వేత...?

ఎర్రవరం రాజులుబాబు గుడి వద్ద ఈ పథకంలో రెండేళ్ల క్రితం మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగాయి. అయితే వైర్లకు అడ్డువస్తున్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది చెట్లను నరికేశారు. ఇప్పటి వరకు ఒక్కో మొక్కకు రూ.500 చొప్పున ఖర్చు చేయగా, వాటిని నరికి వేయడంతో ఆ సొమ్మంతా వృథా అయింది. ఇలా వంద మొక్కలను నరికివేసినట్టు తెలిసింది. అయితే మొక్కలు పూర్తిగా తొలగించవలసిన అవసరం లేదని, వాటి చివరన ఉన్న కొమ్మలు కట్ చేస్తే సరిపోయేదని సోషల్‌ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



పాతమల్లంపేటకు వెళ్లే మార్గంలో విద్యుత్ వైర్ల కింద నాటుతున్న మొక్కలు

కొత్తగా మరో 2,800 మొక్కలు...

రెండేళ్ల కిందట నాటిన మొక్కలు పూర్తిగా నరికివేయగా...మళ్లీ 15 రోజుల కిందట మరో 2,800 మొక్కలు నాటారు. జోగుంపేట జంక్షన్ నుంచి పాతమల్లంపేట వరకు, గొలుగొండ నుంచి ధారమఠం శివాలయం వరకు, చంద్రయ్యపాలెం రోడ్డు నుంచి బుడ్డడపాడు గ్రామం వరకు మొక్కలు నాటి, రక్షణకు కంచెలు ఏర్పాటు చేశారు. 80 శాతం వరకు విద్యుత్ వైర్ల కిందే నాటారు.

చెట్లు తొలగించే అధికారం లేదు

చెట్లను తొలగించే అధికారం విద్యుత్‌శాఖ సిబ్బందికి లేదు. విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉండే చెట్ల కొమ్మల చివర్లను నరికితే సమస్య పరిష్కారమవుతుంది. విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడవు. కానీ ఎర్రవరం గుడి వద్ద విద్యుత్ సిబ్బంది చెట్లను పూర్తిగా తొలగించేశారు. ఇక మీదట అప్రమత్తంగా ఉంటాం. కొత్తగా నాటిన మొక్కలను ఇలా నరకకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. మొక్కల సంరక్షణకు విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పనిచేస్తాం.

–భాగ్యలక్ష్మి, నర్సీపట్నం డివిజన్ సోషల్‌ఫారెస్టు అధికారి

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో మూర్తి ఆదేశించారు. స్థానిక కేజీబీవీని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోజనం వండే పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. మరుగుదొడ్ల నిర్వహణపై కూడా పర్యవేక్షణ ఉండాలని పాఠశాల ఎస్‌వో త్రివేణిని సూచించారు.

'ఉపాధి హామీ పథకం'లో కొత్తపనులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

మాకవరపాలెం: ఉపాధి హామీ పథకంలో చేపట్టేందుకు కొత్త పనులు గుర్తించాలని నర్సీపట్నం డీఎల్‌డీవో ఉదయశ్రీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదేళ్లపాటు ఉపాధి పథకంలో పనులు చేపట్టే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ నెల 23న గ్రామసభల్లో ఈ పనులకు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పనులకు గ్రామసభ ఆమోదం తప్పనిసరి

నాతవరం: ఉపాధి హామీ పథకం పనులకు గ్రామసభల్లో తప్పని సరిగా ఆమోదం పొందాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. ఆయన బుధవారం వెలుగు కార్యాలయంలో మండల స్థాయి అధికారులు ఉపాధి హామీ పథకం సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఉపాధి హామీ పథకంలో పనులు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.మూర్తి, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండవ విడత వెబ్ కౌన్సెలింగ్

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఈ నెల 22 నుంచి రెండవ విడత వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, ఆసక్తిగల విద్యార్థినీవిద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు పేర్కొన్నారు. బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ బోటనీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీఏ హిస్టరీలో మిగులు సీట్లు భర్తీకి రెండవ విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో మందుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు: గొండుపాలెంలో సమాజ మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన కేర్, వాసన్ ఐ కేర్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రులకు చెందిన వైద్యులు సుకన్య, శ్వేత, చికీతాలు 219 మందికి వైద్యసేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పైలా ప్రసాదరావు, రొంగలి మహేష్, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, సమాజ మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ పీలా శ్రావణ్‌కుమార్, వంటాకు నరేంద్రవర్మ పాల్గొన్నారు.

గ్రీన్ క్లబ్ లోగో ఆవిష్కరణ



ఉపాధ్యాయులతో కలిసి క్లబ్ లోగోను ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: పర్యావరణ పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు సేవ్ ఎన్విరాన్‌మెంట్ నినాదంతో గ్రీన్‌క్లబ్ ఏర్పాటు చేశారు. క్లబ్ లోగోను స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం ఆవిష్కరించి, మాట్లాడారు. క్లబ్ ద్వారా మొక్కలు నాటడం, మట్టి విగ్రహాలు వినియోగంపై అవగాహన, ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు క్లబ్ నిర్ణయం తీసుకుందని క్లబ్ అధ్యక్షుడు డి.గోపినాథ్ స్పీకర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జి.వి.రమేష్, కె.వి.రమణ, మడ్డు శ్రీనివాసరావు, కుంచే మురళి, బి.అప్పారావు, జి.శ్రీరామ్మూర్తి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల గుర్తింపులో మార్పులు చేయాలి



ఏపీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు వెంకన్న, బి.టి. దొర

దేవరాపల్లి: ఉపాధి హామీ పథకంలో ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభల్లో పనుల గుర్తింపులో మార్పులు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న కోరారు. ఈ మేరకు స్థానిక ఉపాధి హామీ పథకం ఏపీవో చంద్రకళకు సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొరతో కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, లింక్ రోడ్లు, శ్మశాన వాటికలకు రోడ్ల నిర్మాణాలు తదితర పనులు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఉపయోగపడే పనులు తక్కువగా ఉన్నాయని, మెటీరియల్ చార్జ్ ద్వారా చేపట్టే పనులు ఎక్కువగా ఉన్నాయని, వీటిని మార్పు చేయాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



రోలుగుంటలో పశువుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది



పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశు వైద్యాధికారి నాయుడు

రోలుగుంట: గాలికుంటు వ్యాధిని శాశ్వతంగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా చర్యలు చేపట్టిందని పశువైద్యాధికారి నూకేశ్వరరావు తెలిపారు. ఐదు బృందాలతో 314 పశువులకు బుధవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 12 వేల పశువులకు టీకాలు వేస్తున్నట్టు చెప్పారు.

కె.కోటపాడు: వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు టీకాలు వేయించాలని కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు అన్నారు. కొరువాడ, డి.అగ్రహారం గ్రామాల్లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకకుండా టీకాల ద్వారా పశువులకు రక్షణ కల్పించవచ్చని చెప్పారు. రెండు గ్రామాల్లో 142 పశువులకు టీకాలు వేశారు.

గోవాడ సుగర్స్ కార్మికుల ఆందోళన



ధర్నా చేస్తున్న కార్మికులు

చోడవరం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు బుధవారం ఆందోళన చేశారు. ఫ్యాక్టరీ ఆవరణంలో నిరసన తెలిపి, ఎండీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గత సీజన్ ముగిసి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఓవరాయిలింగ్ పనులు చేపట్టకపోతే సకాలంలో ఎలా క్రషింగ్ ప్రారంభించడానికి వీలవుతుందని గుర్తింపు యూనియన్ మాజీ అధ్యక్షుడు శరగడం రామునాయుడు ప్రశ్నించారు. కార్మికులకు రావలసిన జీత భత్యాలు, వెంటనే విడుదల చేయాలని, రెండేళ్లుగా కార్మికులకు రావలసిన ఓటీ నగదు చెల్లించాలని, ఫ్యాక్టరీలో క్యాంటీన్‌ను పునప్రారంభించాలని, ఇక్కడి ఆస్పత్రిలో వెంటనే వైద్యసేవలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు



మాడుగుల బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

- భారత్ బంద్‌లో భాగంగా ఆందోళనలు
- పలు ప్రాంతాల్లో ర్యాలీలు, మానవహారాలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన భారత్ బంద్‌లో భాగంగా చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. వర్గీకరణ వద్దు అంతా కలిసే ఉంటామని నినాదాలు చేశారు.



చోడవరంలో బంద్ చేస్తున్న దళిత సంఘాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాదిలో చెరుకు కాటా నుంచి వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ, వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి, ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు పాఠశాలలను,కార్యాలయాలను మూయించారు. ర్యాలీలో మాల మహానాడు జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు బూసి కోటి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, ఏయిమ్ అధ్యక్షుడు శేఖర్ నాయకులు అప్పారావు, కామరాజు, మోహన్,వీర్రాజు,మురళి, లోవరాజు,కనకరాజు తదితర్లు పాల్గొన్నారు.

రోలుగుంట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రోలుగుంటలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలను మూసివేయించారు. ఈ కార్యక్రమంలో కిడారి మల్లేశ్వరరావు, బలరాం ఆర్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం వరకు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.

గొలుగొండ: ఎస్సీ కులాల వర్గీకరణను వ్యతిరేకిస్తూ గొలుగొండ మండలంలో ఏఎల్‌పురం, గొలుగొండ, జోగుంపేట, చీడిగుమ్మలలో ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించారు.

మాడుగుల: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాడుగులలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. భారత్ బంద్‌లో భాగంగా స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో ఆటోలు, బస్సులను కొంత సేపు నిలుపుదల చేశారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసి వేసి బంద్‌కు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు మరువాడ ఈశ్వరరావు, పోరాట సమితి సభ్యులు తమ్మెల ఈశ్వరరావు, పెట్టా ఈశ్వరరావు, విశ్వేశ్వరరావు, తాడిప్రకాశ్, బత్తిన మాలిబాబు, వంకర రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



వడ్డాదిలో ర్యాలీలో పాల్గొన్న నిరసనకారులు

చోడవరంలో బంద్ ప్రశాంతం

చోడవరం: ఎస్సీ వర్గీకరణ వల్ల దిగువస్థాయి ఎస్సీ కులాలన్నీ రిజర్వేషన్ల పొందడంలో తీవ్రంగా నష్టపోతామంటూ పలు ఎస్సీకుల సంఘాలు చేపట్టిన భారత్ బంద్ చోడవరం నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగింది. బంద్‌కు సహకరించాలని మాలమహానాయుడుతోపాటు పలు దళిత కుల సంఘాల ప్రతినిధులు చోడవరం పట్టణంతోపాటు వడ్డాది, రావికమతం, కొత్తకోట, రోలుగుంటలో వ్యాపారులను, ప్రజలను కోరారు. దీంతో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. మరో పక్క ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను, కాలేజీలను మూయించారు. ఆర్టీసీ బస్సులు పాక్షికంగా నడిచాయి. అంబేడ్కర్ విగ్రహాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఆందోళనలో దళిత సంఘాల నాయకులు సియాద్రి శ్రీనువాసరావు, వేచలపు ప్రకాష్, బూసి కోటి, ఒలిమరక ఈశ్వరరావు, మోస రమేష్, సియాద్రిచలపతిరావు, లోవచందు, కొత్తపల్లి శ్రీనువాసరావు, పొట్నూరి రాజారావు, మట్టా అప్పలనర్స, మల్లేటి రాజు, బుంగా బుల్లిబాబు, పూడి దేవ, పూడి అర్జున్, మరువాడ అర్జునరావు, టి. శేఖర్‌అప్పారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దేవరాపల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ మండల నాయకులు బుధవారం ఆందోళన చేశారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ మండల నాయకుడు కాటపల్లి అప్పారావుతో పాటు కార్లి సాయి సుందరరావు, వేచలపు గంగాధర్, పతివాడ నాగభూషణం, పరవాడ అప్పారావు, సబ్బవరపు మాలిబాబు, ఉల్లి దేముడు, కంచిమాలి అప్పారావు, కాటపల్లి అప్పారావు, ఉల్లి చింతాలు, దేగల సుదర్శన్, మల్లేటి డేవిడ్, దువ్వాడ రమేష్, పాటేల దేముళ్లు, మచ్చ మహేష్, చిన్నారావు, ఈశ్వరరావు, కామరాజు తదితర్లు పాల్గొన్నారు.

వర్గీకరణపై పునరాలోచన చేయాలి

నర్సీపట్నం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా నర్సీపట్నంలో దళిత సంఘాలు బుధవారం ఆందోళన చేశాయి. ఆర్టీసీ బస్సుల రాకపోకలను స్తంభింపజేశారు. పట్టణంలో పాఠశాలలు, దుకాణాలు మూయించారు. మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు డిపోకు పరిమితమయ్యాయి. అబిడ్‌సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు, మాజీ జెడ్పీటీసీ చిట్ల చలపతిరావు, నేతల నాగేశ్వరరావు, మట్రా అప్పలరాజు మాట్లాడుతూ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు పునరలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లంపల్లి ఈశ్వరరావు, మట్రా గోపి, రావాడ ప్రకాష్, జానికీరామ్, రాజాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంటలో బంద్‌లో పాల్గొన్న ఆందోళనకారులు



ఏఎల్‌పురంలో ఆందోళన చేస్తున్న నిరసనకారులు



దేవరాపల్లిలో ఆందోళన చేస్తున్న నాయకులు



నర్సీపట్నం అబిడ్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన దళిత సంఘాల నాయకులు



నర్సీపట్నంలో మూతపడిన దుకాణాలు

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25వ తేదీన నిర్వహించే పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని ఎంఈవో సీహెచ్ తలుపులు కోరారు. జనవిజ్ఞాన వేదిక నాయకులతో కలిసి బుధవారం ఆయన చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ పోటీలకు ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులరెడ్డి, విశ్రాంతి లైబ్రేరియన్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.